

కాషాయ జెండా ఎగరాలి

జహీరాబాద్ నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగురవేయాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ అన్నారు.

- IIలో ▸



కుస్తీమే సవాల్

జిల్లాలోని పలు ప్రాంతాలలో కుస్తీ పోటీలు నిర్వహించారు. మల్లయోధులు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు.

- IIIలో ▸

గరిష్టం/కనిష్టం

42.3 /20.7

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వ్యయ పరిశీలకుడిగా మోతీలాల్ షెటే



కామారెడ్డి క్రైం : జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడిగా ఐఆర్ఎస్ 2014 బ్యాచ్‌కు చెందిన మోతీలాల్ షెటే నియమితులయ్యారు. శుక్రవారం ఆయన జిల్లాకు రాగా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధుశర్మ స్వాగతం పలికారు. ఆయన జిల్లా అధికారులతో సమావేశమై ఎన్నికల ప్రక్రియ, ఏర్పాట్లు, వ్యయ నిర్వహణ కమిటీ, సహాయ వ్యయ పరిశీలకుల నియామకం తదితర అంశాలపై చర్చించారు.

వినియోగదారులకు అందుబాటులో ఉండాలి



కామారెడ్డి టౌన్ : విద్యుత్ శాఖ ఉద్యోగులు వినియోగదారులకు అందుబాటులో ఉండాలని జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ అధికారి(ఎస్ఈ) రమేశ్‌బాబు ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో దోమకొండ సబ్ డివిజన్ విద్యుత్ ఉద్యోగులకు శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. నిరంతరం విద్యుత్ సరఫరా, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, విద్యుత్ ప్రమాదాల నివారణ, విద్యుత్ చౌర్యం అరికట్టడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డీఈ ఇస్లావత్ సలియా, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్



కామారెడ్డి టౌన్ : జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పున్న రాజేశ్వర్‌రావు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ త్వరలో నియోజకవర్గంలోని రెండు వేల మందిని కాంగ్రెస్‌లో చేర్పి భారీ సభ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, నాయకులు గడ్డం చందు, రాజేశ్వర్, గోనే శ్రీను, పంపరి శ్రీనివాస్, మామిండ్ల అంజయ్య తదితరులున్నారు.

జిల్లా జడ్జికి వీడ్కోలు



కామారెడ్డి టౌన్ : కామారెడ్డి జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎస్ఎన్ శ్రీదేవి బదిలీపై వెళ్తుండటంతో జిల్లా న్యాయ శాఖ ఉద్యోగులు శుక్రవారం వీడ్కోలు పలికారు. న్యాయశాఖ ఉద్యోగులు సంఘం జిల్లా అధ్యక్షుడు జమాల్‌పూర్ భుజంగ్‌రావు మాట్లాడుతూ జిల్లా ఏర్పడినప్పటి నుంచి మొదటి ప్రధాన న్యాయమూర్తిగా ఆమె ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు. అనంతరం ఆమెను ఘనంగా సన్మానించారు. అదనపు న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస్, సీనియర్ న్యాయమూర్తి నాగరాణి, జూనియర్ న్యాయమూర్తులు సుధాకర్, దీక్ష, ఉద్యోగులు శ్రీధర్, చంద్రసేన్‌రెడ్డి, రజిత, వెంకట్‌రెడ్డి, సాయికృష్ణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నగదు పట్టివేత



నిజాంసాగర్: బ్రాహ్మణపల్లి చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రాత్రి వాహనాలను తనిఖీ చేస్తుండగా రూ. 11.5 లక్షల నగదు పట్టుబడినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా హైదరాబాద్ నుంచి కిరణ్ అనే వ్యక్తి రూ. 6 లక్షలు, షేక్ అలీం అనే వ్యక్తి రూ. 5.5 లక్షల నగదును జల్నాకు తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఆ నగదు ఎక్కడినుంచి తెస్తున్నారన్న దానికి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేశామని తెలిపారు.

కమల వికాసానికి కసరత్తు!

మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారించింది. లోక్‌సభ స్థానంలో కాషాయ జెండా ఎగరవేయాలన్న లక్ష్యంతో వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. గెలుపుకోసం విశ్వప్రయత్నాలు చేస్తున్న కమలదళం.. ప్రధాని నరేంద్ర మోదీతో బహిరంగ సభకూ ప్లాన్ చేసింది. ఈనెల 30న అందోల్‌కు సమీపంలోని అల్లాదుర్గంలో నిర్వహించే సభలో ప్రధానమంత్రి పాల్గొననుండడంతో ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది.



- త్రిభాషా సంగమ స్థలిపై బీజేపీ కన్ను
- జహీరాబాద్‌లో గెలుపు కోసం విశ్వప్రయత్నాలు
- ఈనెల 30న మోదీ సభకు ఏర్పాట్లు

సాక్షి, కామారెడ్డి : జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అటు కర్ణాటక, ఇటు మహారాష్ట్ర సరిహద్దులు కలిగి ఉంది. మూడు రాష్ట్రాల కూడలి అయిన నియోజకవర్గంలో తెలుగుతోపాటు కన్నడం, మరాఠీ మాట్లాడతారు. మూడు రాష్ట్రాల సంప్రదాయలు పాటిస్తారు. త్రిభాషా సంగమ ప్రాంతమైన జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం 2008లో ఆవిర్భవించింది. ఉమ్మడి మెదక్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల్లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో ఈ నియోజకవర్గం ఏర్పాటైంది. 2009లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన సురేశ్ షెట్కార్ విజయం సాధించారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన బీబీ పాటిల్ గెలుపొందారు. 2019 లోనూ అయనే విజయ తీరాలకు చేరారు. వరుసగా రెండుసార్లు బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన పాటిల్.. ఈసారి బీజేపీలో చేరి ఆ పార్టీ నుంచి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కాగా కాంగ్రెస్ అభ్యర్థిగా సురేశ్ షెట్కార్, బీఆర్ఎస్ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్ పోటీలో ఉన్నారు.

కామారెడ్డిలో గెలుపుతో ఊపు..

ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో నాలుగుచోట్ల కాంగ్రెస్, రెండుచోట్ల బీఆర్ఎస్, ఒకచోట బీజేపీ విజయం సాధించాయి. కామారెడ్డిలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన కె.వెంకటరమణారెడ్డి.. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లనుంచి బరిలో నిలిచిన కేసీఆర్, రేవంత్‌రెడ్డిలాంటి ఇద్దరు ఉద్దండులను ఓడించి చరిత్ర సృష్టించారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని మిగతా అసెంబ్లీ స్థానాలలో కాషాయ పార్టీ అభ్యర్థులు మూడో స్థానంలో నిలిచారు. ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ అసెంబ్లీ స్థానాలలో ఓటు బ్యాంకు పెరిగింది. కాగా కామారెడ్డిలో గెలిచిన ఊపులో ఉన్న బీజేపీ.. జహీరాబాద్ పార్లమెంట్ స్థానంపైనా ఆశలు పెట్టుకుంది. ఈ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. బీజేపీ టికెట్టు కోసం ఎంతో మంది నేతలు ప్రయత్నించినా.. సిట్టింగ్ ఎంపీని పార్టీలోకి చేర్చుకుని అభ్యర్థిగా ప్రకటించింది. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. ఆయన పార్లమెంట్ నియోజకవర్గంలో ఇప్పటికే పలుమార్లు పర్యటించి, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బూత్ స్థాయి కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తూ, వారిని ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం చేస్తున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతారతోపాటు మాజీ ఎమ్మెల్యేలు యెండల లక్ష్మీనారాయణ, సౌదాగర్ గంగారాం, పండరి, పార్టీ నాయకులు బాణాల లక్ష్మారెడ్డి, తదితరులు ఆయా ప్రాంతాలలో ప్రచారంలో పాల్గొంటున్నారు. కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. పార్టీ గెలుపు కోసం నేతలంతా శ్రమిస్తున్నారు.

భక్తి భావం కలిసి వచ్చేనా..

జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో దాదాపు అన్ని ప్రాంతాల్లో భక్తి భావం ఎక్కువగా కనిపిస్తుంది. ఈ ప్రాంతంలో కష్టపడితే విజయం సాధించవచ్చని భావిస్తున్న బీజేపీ.. ఆ దిశగా కసరత్తు చేసింది. అయోధ్యలో రామాలయ నిర్మాణం పూర్తయిన తరువాత నియోజకవర్గానికి చెందిన పలువురిని ప్రత్యేక రైళ్లలో అక్కడికి తీసుకువెళ్లి దర్శనం చేయించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చరిష్మాతోపాటు అయోధ్యలో రామాలయ నిర్మాణం అంశాలు కలసి వస్తాయని ఆ పార్టీ నేతలు ఆశిస్తున్నారు.

మోదీ సభకు భారీ జనసమీకరణ..

ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈనెల 25న బాన్సువాడలో అమిత్‌షా సభ నిర్వహించాల్సి ఉంది. అయితే మరింత ఊపు తెచ్చేందుకు ప్రధానమంత్రి సభ నిర్వహించాలని నిర్ణయించి అమిత్ షా సభ రద్దు చేశారు. ఈనెల 30న మధ్యాహ్నం 3 గంటలకు అందోల్‌కు సమీపంలోని అల్లాదుర్గంలో మోదీ బహిరంగ సభ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభకు అటు సంగారెడ్డి జిల్లా నుంచి ఇటు కామారెడ్డి జిల్లా నుంచి భారీగా జనాన్ని తరలించే పనిలో బీజేపీ నేతలు నిమగ్నమయ్యారు. అల్లాదుర్గం జుక్కల్ అసెంబ్లీ నియోజక వర్గానికి పొరుగునే ఉంటుంది. దీంతో ఆ ప్రాంతం నుంచి ఎక్కువ మందిని సమీకరించాలని యోచిస్తున్నారు. అలాగే ఎల్లారెడ్డి, బాన్సువాడ నియోజక వర్గాల నుంచి కూడా జనాన్ని సభకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి



ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం : పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కేంద్రంలో జిల్లాలో ఏర్పాటు చేయనున్న 913 పోలింగ్ కేంద్రాలకు సాఫ్ట్‌వేర్ ద్వారా 20 శాతం అదనంగా సిబ్బందిని ఎంపిక చేశామన్నారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇద్దరు పోలింగ్ సిబ్బందితో మొత్తం 1,093 బృందాలను ర్యాండమైజేషన్ ద్వారా నియోజకవర్గాలకు కేటాయించామన్నారు. 30 శాతం అదనంగా 85 మంది మైక్రో అబ్జర్వర్‌ల మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను వర్చువల్ విధానంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు గోపాల్ జి తివారి సమక్షంలో చేపట్టినట్లు వెల్లడించారు. మహిళలు, దివ్యాంగులకు ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలకు సైతం సిబ్బందిని కేటాయించామని తెలిపారు. 4,388 మంది పోలింగ్ సిబ్బందికి ఇప్పటికే ఆయా కేంద్రాల్లో మాస్టర్ శిక్షకుల చేత పోలింగ్ నిర్వహణపై మొదటి విడత శిక్షణ తరగతులు నిర్వహించినట్లు వెల్లడించారు. రెండో విడత శిక్షణకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రిజర్వ్ సిబ్బంది సైతం అందుబాటులో ఉంటారని, పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ప్రతి బృందంలో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక సహాయ ప్రిసైడింగ్ అధికారి, ఇతర పోలింగ్ సిబ్బంది ఉంటారని వివరించారు. కార్యక్రమంలో సీపీవో రాజారాం, మ్యాన్ పవర్ నోడల్ అధికారి వరదారెడ్డి, ఎన్ఐసీ రాష్ట్ర అధికారి రవి, జిల్లా అధికారి శ్రీకాంత్, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

18 నామినేషన్ల తిరస్కరణ

కామారెడ్డి క్రైం: జహీరాబాద్ లోక్‌సభ స్థానంలో దాఖలైన నామినేషన్లను శుక్రవారం పరిశీలించారు. 14 మంది అభ్యర్థులకు సంబంధించిన 18 నామినేషన్లను తిరస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి, సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నిర్వహించిన విషయం తెలిసిందే. మొత్తం 40 మంది అభ్యర్థులు 68 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. శుక్రవారం సంగారెడ్డిలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జహీరాబాద్ పార్లమెంట్ సాధారణ ఎన్నికల పరిశీలకుడు గోపాల్ జి తివారి సమక్షంలో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ నిర్వహించారు. నిబంధనల ప్రకారం లేని 18 నామినేషన్లను తిరస్కరించారు. ఈ నెల 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. పరిశీలన కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రెయినీ ఐఏఎస్ మనోజ్, అభ్యర్థులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌లో..

సుభాష్‌నగర్(నిజామాబాద్ అర్బన్): నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి దాఖలైన నామినేషన్లను శుక్రవారం పరిశీలించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సాధారణ ఎన్నికల పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్ సమక్షంలో ఈ ప్రక్రియ కొనసాగింది. 10 మంది అభ్యర్థులు సమర్పించిన అన్ని సెట్ల నామినేషన్లను వివిధ కారణాల వల్ల తిరస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి, నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. మొత్తం 42 మంది అభ్యర్థులు 90 నామినేషన్లు వేయగా స్క్రూటినీలో 10 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించామన్నారు. 32 మంది నామినేషన్లు చెల్లుబాటయ్యాయన్నారు. మిర్యాల్‌కర్ జయప్రకాశ్, పోతు అశోక్, మహమ్మద్ జమీల్, ఎండీ షాహెద్ ఖాన్, కొండూరు గంగాధర్, పానుగంటి రజితావాణి, చెంచుల అశోక్, బేగరి పోశం, మీసాల శ్రీనివాస్‌రావు, వి.మహాతేజ నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని తెలిపారు.

మోదీ సభను విజయవంతం చేయాలి

- జహీరాబాద్ ప్రభారి పెద్దోళ్ల గంగారెడ్డి



మాట్లాడుతున్న పెద్దోళ్ల గంగారెడ్డి

ఎల్లారెడ్డి: సంగారెడ్డి జిల్లా అల్లాదుర్గంలో ఈనెల 30న నిర్వహించే ప్రధానమంత్రి మోదీ సభను విజయవంతం చేయాలని జహీరాబాద్ ప్రభారి పెద్దోళ్ల గంగారెడ్డి కోరారు. శుక్రవారం ఆయన ఎల్లారెడ్డిలో విలేకరులతో మాట్లాడారు. దేశాభివృద్ధి కోసం బీజేపీకి ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి ఆరోపించారు. బీబీ పాటిల్ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వని వ్యాపార వర్గాలను బెదిరించడం సరికాదన్నారు. దేశంలో ఎక్కడ చూసినా మోదీ ప్రభంజనం కనిపిస్తోందని, జహీరాబాద్‌లోనూ బీజేపీదే గెలుపని పేర్కొన్నారు. బీబీ పాటిల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు, రాష్ట్ర నాయకుడు పైడి ఎల్లారెడ్డి, మండల అధ్యక్షుడు నర్సింలు, నాయకులు బాలకిషన్, సతీష్, ఎస్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా విధులు నిర్వహించాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకుడు మోతీలాల్ షెటే



మాట్లాడుతున్న వ్యయపరిశీలకుడు మోతీలాల్ షెటే

కామారెడ్డి క్రైం : ఎన్నికల వ్యయ పరిశీలన పారదర్శకంగా చేపట్టాలని లోక్‌సభ ఎన్నికల వ్యయ పరిశీలకుడు మోతీలాల్ షెటే సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో అభ్యర్థులు చేసే ఖర్చును పక్కాగా లెక్కించాలని ఆదేశించారు. రోజు వారి నివేదికలు సమర్పించాలన్నారు. రూ.10 లక్షల పైగా జరిగే అనుమానాస్పద బ్యాంకు లావాదేవీలు, బహుమతుల తరలింపుపై నిఘా ఉంచాలన్నారు. అనంతరం కంట్రోల్ రూం, మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. సి-విజిల్, 1950 టోల్ ఫ్రీ ఫిర్యాదులపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. సామాజిక మాధ్యమాలు, సోషల్ మీడియా ప్రచారంపై పర్యవేక్షణ చేయాలన్నారు. పెయిడ్ న్యూస్, ప్రకటనలపై ప్రత్యేక దృష్టి పెట్టి, అభ్యర్థుల ఎన్నికల ఖర్చుగా నమోదు చేయాలని సూచించారు.

పటిష్ట చర్యలు చేపడుతున్నాం..

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లాలో పటిష్ట చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు వివిధ బృందాలు, పోలీస్ శాఖ ద్వారా 72 మంది నుంచి రూ.కోటి 38 లక్షల 68 వేల నగదును పట్టుకున్నట్లు తెలిపారు. సరైన పత్రాలు చూపిన 57 మందికి రూ.72 లక్షలు తిరిగి అందజేశామని వివరించారు. రూ.53 లక్షల నగదును ఆదాయపు పన్ను శాఖ వారికి అప్పగించామన్నారు. పోలీసు, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా రూ.55 లక్షల 57 వేల విలువ గల 40,123 లీటర్ల మద్యాన్ని, రూ.40 వేల విలువ గల 143 కిలోల మత్తు పదార్థాలను పట్టుకున్నట్లు వివరించారు. జిల్లాలో 64 సమస్యాత్మక లొకేషన్లు, 183 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. 516 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ రెండు అంతర్రాష్ట్ర చెక్ పోస్టులతో పాటు, జిల్లా సరిహద్దు చెక్ పోస్టులపై గట్టి నిఘా పెట్టామన్నారు. సమావేశంలో ట్రెయినీ ఐపీఎస్ కాజల్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీంద్రరాజు, నోడల్ అధికారి అంబాజీ, ఆదాయపు పన్ను అధికారి మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి



కామారెడ్డి ఆర్టీసీ గ్యారేజీ ఆవరణను పరిశీలిస్తున్న ఆర్టీసీ ఈడీ వినోద్‌కుమార్

కామారెడ్డి టౌన్ : ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని కరీంనగర్ జోన్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన కామారెడి డిపోను తనిఖీ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్ని విభాగాల్లో తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు. గ్యారేజీ ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం ఆర్టీసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో మహిళల రద్దీ పెరిగిందన్నారు. అందుకు అనుగుణంగా ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నామని చెప్పారు. డ్రైవర్లు, కండక్టర్లు ఒత్తిడికి గురికావొద్దని, ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. డీఎం ఇందిర, అధికారులు పాల్గొన్నారు.

జీజీహెచ్ ప్రాథమిక చికిత్సకేనా..!

- అత్యాధునిక పరికరాలున్నా అందని మెరుగైన వైద్యం
- ప్రైవేటుకు రోగులను రిఫర్ చేయడం వెనుక ఆంతర్యమేమిటో..!

నిజామాబాద్‌నాగారం : జీజీహెచ్..పేరుకే పెద్దాస్పత్రి. ఆస్పత్రిలో అత్యాధునిక పరికాలు ఉన్నా.. మెరుగైన వైద్య చికిత్సలు మాత్రం అందడంలేదు. ఉత్తమ వైద్య సేవలు అందించే అవకాశం ఉన్నా.. కొందరు వైద్యులు ప్రాథమిక వైద్య సేవలు చేసి రోగులను తమ ప్రైవేటు ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. రూ. కోట్ల విలువ చేసే పరికరాలు, సర్జరీ చేసే వైద్యులు అందుబాటులో ఉన్నా ప్రైవేటుకు తరలించడం వెనుక ఆంతర్యమేమిటో తెలియాల్సి ఉంది.

రూ. కోట్ల విలువ చేసే పరికరాలున్నా..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సదుపాయాలు, పరికరాలు ఉన్నాయి. పెద్ద సర్జరీలు చేసే వైద్యులున్నారు. అత్యవసర సమయంలో రోగులకు మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంది. కానీ ప్రాథమిక చికిత్స అందించి మమ అనిపిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రూ. కోట్ల విలువ చేసే పరికరాలున్నా.. మంచి వైద్యులున్నా.. ప్రాథమిక చికిత్స అందించి రిఫర్ చేస్తుండడం గమనార్హం. కొంతమంది వైద్యులు రోగులను తమకు సంబంధించిన ఆస్పత్రికి తరలిస్తున్నారు.

పలువురి పరామర్శ

వ్యాన్ బోల్తా ప్రమాదంలో 36 మంది గాయపడగా ఇందులో 15 మందిని రాత్రికి ప్రైవేటుకు తరలించారు. ఐదుగురు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను ఎంపీ అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిలు పరామర్శించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ సైతం పరామర్శించారు.

హడావుడి కోసమే..

జిల్లాలో ఎక్కడైనా ప్రమాదాలు జరిగినా, ఫుడ్ పాయిజన్ లాంటి ఘటనలు జరిగితే ముందుగా జీజీహెచ్ తరలిస్తున్నారు. కానీ ఇక్కడి సరైన వైద్య సేవలు అందడం లేదు. గురువారం రాత్రి సమయంలో నిజామాబాద్ రూరల్ మండలం మల్కాపూర్ శివారులో డీసీఎం వ్యాన్ బోల్తా పడింది. ఇందులో 36 మంది గాయపడగా ఇద్దరు మరణించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. కాగా వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి.. మెరుగైన చికిత్స పేరుతో కొంత మందిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఒకే ప్రైవేటు ఆస్పత్రికి ఆరుగురు రోగులను రిఫర్ చేశారు. సదరు ఆస్పత్రి జీజీహెచ్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ వైద్యుడికి సంబంధించినది కావడంతో అనుమానాలకు బలం చేకూరుతోంది.

కమీషన్ల కోసమే రిఫర్

జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్లో కొంత మందిని మెరుగైన చికిత్స పేరిట ప్రైవేటు ఆస్పత్రులకు రోగులను రిఫర్ చేసుకున్నారు. కొంత మంది వైద్యులు తమ ఆస్పత్రులకు పేషెంట్లను రిఫర్ చేసుకుంటున్నా అధికారులు స్పందించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

– సయ్యద్‌ఖైసర్, కాంగ్రెస్ మైనారిటీ నాయకుడు

ప్రైవేటుకు పంపడం సరికాదు

వ్యాన్ బోల్తా ప్రమాదంలో గాయపడిన వారిని జీజీహెచ్‌కు తీసుకువచ్చారు. ఇక్కడే చికిత్స అందించి మళ్లీ అర్ధరాత్రి ప్రైవేటుకు తరలించారు. పరికరాలు, వైద్యులున్నా ప్రైవేటుకు తరలించడం సరికాదు. ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దు.

– మునిపల్లి సాయిరెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్

నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి

- అదనపు కలెక్టర్ చంద్రమోహన్



కామారెడ్డి రూరల్ : రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ సూచించారు. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి, లింగాయపల్లి, రాజంపేట మండలం పొందుర్తిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా చర్యలు చేపట్టాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 290 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 17,810 మంది రైతుల నుంచి 1,09,489 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతుల ఖాతాల్లో రూ.124.39 కోట్లు జమ చేశామన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మల్లికార్జున్ బాబు, జిల్లా ఇన్‌చార్జి పౌరసరఫరాల మేనేజర్ నిత్యానంద్, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్లు శ్రీనివాస్, కిష్టయ్య, సీఈవో మోహన్‌రావు, ఏఈవో అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నీటిఎద్దడి నివారణ పనుల పరిశీలన



భిక్కనూరు : మండలంలోని భాగిర్తిపల్లి మల్లు పల్లి గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణ పనులను ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ప్రత్యేక అధికారిని సుష్మా శుక్రవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్‌డీఎఫ్ నిధులతో తవ్వించిన నీటి పైపులైన్ల పనులను వారు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ ఉన్నారు.

తాగునీటిని వృథా చేయొద్దు

బాన్సువాడ రూరల్ : తాగునీటిని వృథా చేయరాదని బాన్సువాడ మండల పంచాయతీ అధికారి సత్యానారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన దేశాయిపేట్ గ్రామంలో పర్యటించారు. కుళాయిలకు ఆన్‌ఆఫ్ లేకపోవడంతో విలువైన నీరు వృథాగా పోతుండటంపై జీపీ కార్యదర్శిని రవిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌లో గోసంగి కులస్తుల చేరిక



కామారెడ్డి టౌన్ : గోసంగి సంఘం జిల్లా అధ్యక్షుడు కళ్లెం సత్యం బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి గోసంగి కులస్తులతో కలిసి శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ సమక్షంలో పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు తదితరులున్నారు.

ఓటు వినియోగంపై అవగాహన



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం ప్రారంభమైన ఓటరు కార్డుల పంపిణీ, ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని గిర్దావర్ అంజు పరిశీలించారు. ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలు ఉన్నారు.

మోదీ పాలనలో మహిళలకు సంక్షేమ పథకాలు

- ఎస్‌హెచ్‌జీ రుణాల్లో కేంద్రం సబ్సిడీ 5శాతం
- బీజేపీ అభ్యర్థి, ఎంపీ ధర్మపురి అర్వింద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

సుభాష్‌నగర్: నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని వర్గాల మహిళల సంక్షేమానికి పథకాలు అమలు చేస్తున్నదని బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. నగరశివారులోని శ్రీరామ గార్డెన్‌లో శుక్రవారం పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి మహిళా మోర్చా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్వింద్ మాట్లాడుతూ.. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) మహిళలకు రూ.6382 కోట్ల రుణాలను అందాయని, అందులో వడ్డీ మాఫీ కింద కేంద్రం 5శాతం భరిస్తోందని తెలిపారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం మిగతా 4శాతం చెల్లించకపోవడంతో మహిళలపై వడ్డీభారం పడుతోందని అన్నారు. అలాగే ముద్రరుణాల కింద నియోజకవర్గంలో రూ.2450 కోట్లు ఇచ్చామని, వీటితోపాటు మహిళల సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి కేంద్రం అనేక పథకాలు అమలు చేస్తున్నదన్నారు. ముఖ్యంగా ఆయుష్మాన్ భారత్, పీఎం ఆవాస్ యోజన, ఉచితరేషన్ తదితర పథకాలు అన్నివర్గాల కోసం ప్రధాని మోదీ అమలుచేస్తున్న విషయాన్ని గ్రహించాలని సూచించారు. కాంగ్రెస్ మాత్రం కేవలం ఒక వర్గం ప్రజల కోసమే పని చేస్తుందని ఆరోపించారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో మహిళల ఓట్లే కీలకమని, అందరూ మోదీపై ఉన్న అభిమానంతో బీజేపీకి ఓటేసి గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మహిళలు ప్రమాదంలో పడటం ఖాయమని అన్నారు. మైనార్టీ మహిళల ఆత్మగౌరవం కోసం ట్రిపుల్ తలాక్ రద్దు కొనసాగుతుందన్నారు. అంతకుముందు అర్బన్ నియోజకవర్గం నుంచి మహిళలు పెద్దసంఖ్యలో అర్వింద్ సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేశ్‌కులాచారి, మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గోపిడి స్రవంతిరెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షుడు పంచరెడ్డి ప్రవళిక, సీనియర్ నాయకులు గీతారెడ్డి, బోగ శ్రావణి, కల్పనాఠాకూర్, కార్పొరేటర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు సన్మానం





విద్యార్థులను సన్మానిస్తున్న ఇంటర్ జిల్లా నోడల్ అధికారి షేక్‌సలాం, ఆర్యబట్ట విద్యార్థులకు సన్మానం

కామారెడ్డి టౌన్ : ఇంటర్ ప్రతిభ చాటిన సాందీపని కళాశాల విద్యార్థులను ఇంటర్ జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు జనార్దన్ రెడ్డి, పెంటయ్య, హరిస్మరణ్‌రెడ్డి తదితరులున్నారు. ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాల యజమాన్యం శుక్రవారం ఘనంగా సన్మానించారు. విద్యార్థులు హరిప్రసాద్, సాత్విక, అవినాష్ గౌడ్, హరిదీప్, హారికను కళాశాల కరస్పాండెంట్ గురువేందర్‌రెడ్డి సన్మానించారు. ప్రిన్సిపాల్ హన్మంత్‌రావు, లెక్చరర్లు సురేష్‌రెడ్డి, వెంకటేష్ తదితరులున్నారు.

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన దండుగుల సాయిలు, లలిత దంపతుల కూతురు విజ్జులత ఇంటర్ ఫలితాల్లో 985 మార్కులు సాధించారు. పిట్లంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల కళాశాలలో చదువుకుంది. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సాయన్న శుక్రవారం ఇంఈవో రామస్వామి, మహేందర్, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు.



తల్లీకూతుళ్లను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జహీరాబాద్‌లో కాషాయ జెండా ఎగరాలి



మాట్లాడుతున్న బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్

కామారెడ్డి టౌన్ : పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ స్థానంలో కాషాయ జెండా ఎగరాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చేవేళ్ల మహేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజారెడ్డి గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన బీజేవైఎం యువ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ ప్రభారి గంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌పై పూర్తిగా ప్రజల నుంచి ఆదరణ పోయిందని, కాంగ్రెస్‌ను నమ్ముకుంటే దేశాన్ని అమ్ముకోవడమేనని విమర్శించారు. బీజేపీకి ఓటు వేసి దేశాన్ని రక్షించుకోవాలన్నారు. దేశంలో 400లకు పైగా ఎంపీ స్థానాలను బీజేపి కైవసం చేసుకుటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నందివేణు, నరేష్, జహీరాబాద్ పరిధిలోని నాయకులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలి



భిక్కనూరు : పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నందున చెక్‌పోస్టుల వద్ద నిఘాను పెంచాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు మోతిలాల్ అన్నారు. శుక్రవారం టోల్ ప్లాజా వద్ద చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట సీఐ సంపత్‌కుమార్, తహసీల్దార్ శివప్రసాద్ ఉన్నారు.

బీజేపీ బలపర్చిన అభ్యర్థులకే మద్దతు



మాట్లాడుతున్న ఇందల్వాయి కిషన్

కామారెడ్డి రూరల్ : బీజేపీ బలపర్చిన అభ్యర్థులకు గాండ్ల కులస్తులు పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు గాండ్ల తేలికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇందల్‌వాయి కిషన్ అన్నారు. శుక్రవారం కామారెడ్డి మండలం ఇస్రోజివాడిలో జరిగిన మోదీ కుటుంబం కుల పెద్దల సభలో భాగంగా గాండ్ల కులస్తుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ దేశం కోసం, ధర్మం కోసం భావితరాల భవిష్యత్తు కోసం మోదీ కృషి అభినందనీయమన్నారు. అనంతరం ఉగాది నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కమలాకర్, కార్యదర్శి రాజేందర్, ఆర్ రవీందర్, గంగాధర్, గాండ్ల శ్రీకాంత్, లక్ష్మణ్, గాండ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



కామారెడ్డి అర్బన్ : స్థానిక రైల్వే స్టేషన్ మండపంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవమి ఉత్సవాల్లో పాల్గొని వివిధ నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులకు రోటరీ క్లబ్ తరపున బహుమతులు అందజేసినట్టు రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు పోలబోయిన సత్యం, రాజనర్సింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు తోర్నాల సుధాకర్, బి.నాగభూషణం, యోగాచార్యులు యెల్లంకి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల సేవలు వెలకట్టలేనివి



భిక్కనూర్ : తెయూ దక్షిణ ప్రాంగణంలో మహనీయుల జయంతి ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ ఆడెపు సత్యనారాయణ హాజరయ్యారు. ఏప్రిల్ మాసం ముగ్గురు మహానుభావుల జన్మదినం సందర్భంగా మహనీయుల జయంతిని జరుపుకుంటున్నామని, దేశానికి జ్యోతిభాపూలే, సావిత్రిబాయి పూలే, బాబు జగ్జీవన్‌రాం చేసి కృషి ఎంతో ఉందన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరి, దక్షిణ ప్రాంగణ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ సుధాకర్ గౌడ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరి, అధ్యాపకులు డాక్టర్ మోహన్ బాబు, ప్రతిజ్ఞ, సవిత తదితరులున్నారు.

సీఎం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న భిక్కనూరు యువత



భిక్కనూరు : హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం క్యాంప్ ఆఫీస్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి సోషల్ మీడియా కో ఆర్డినేటర్లతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. భిక్కనూరు ఎన్‌ఆర్‌ఐ సెల్ యూత్ కమి టీ మెంబర్ చీకోటి సాయి మణికంత, మండల ఇన్‌చార్జి గంపల విలియం భిక్కనూర్ పట్టణ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కర్నాల శ్రీను, బస్వాపూర్ సోషల్‌మీడియా కోఆర్డినేటర్ బాబు, ప్రవీణ్ తదితరులున్నారు.



విదేశీ కొంగల విహారం

మండలంలోని ఘన్‌పూర్(ఎం) ఊర చెరువులో విదేశీ(ఆఫ్రికన్)కొంగలు శుక్రవారం దర్శనమిచ్చాయి. ప్రతి ఏడాది ఏప్రిల్, మే నెలల్లో ఆఫ్రికన్ కొంగలు చెరువులు, కుంటల్లో దర్శనమిస్తాయని స్థానికులు తెలిపారు. మళ్లీ జూన్, జులై నెలల్లో తిరిగి వెళ్లిపోతాయని అన్నారు. ఏప్రిల్, మేలో చెరువులు, కుంటల్లోని నీరు తగ్గిపోయి చేపలు పైకి వస్తాయన్నారు. – మాచారెడ్డి

క్రైం కార్నర్

భర్తను గొంతునులిమి హత్య చేసిన భార్య



సాయిరెడ్డి (ఫైల్)

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కులాస్‌పూర్ గ్రామానికి చెందిన లస్మయి సాయిరెడ్డి (52)ని అతడి భార్య లస్మయి రాధ గొంతునులిమి హత్య చేసింది. గురువారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించి పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సాయిరెడ్డికి రాధతో 30 ఏళ్ల క్రితం పెళ్లికాగా.. శృతి, జ్యోత్స్న, అక్షయ ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. వారికి గతంలోనే పెళ్లిళ్లయ్యాయి. పెద్ద కూతురు శృతి పదేళ్ల క్రితం తన భర్త నుంచి విడాకులు తీసుకుని తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. అప్పటి నుంచి సాయిరెడ్డి భార్య రాధతోపాటు కూతురు శృతిని మానసికంగా హింసిస్తూ కొడుతున్నాడు. దీంతో శృతి నెలరోజుల క్రితం కాలూరులోని ఆమె సోదరి ఇంటికి వెళ్లిపోయింది. ఈక్రమంలో గురువారం రాత్రి సాయిరెడ్డి హత్యకు గురయ్యాడు. శుక్రవారం ఉదయం సమాచారం అందుకున్న సీఐ సురేశ్, ఎస్సై గంగాధర్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టగా, భర్తను తానే గొంతు నులిమి హత్య చేసినట్లు రాధా ఒప్పుకుంది. మృతుడి సోదరి లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా, సాయిరెడ్డి హత్యలో ఎంతమంది ప్రమేయం ఉందనే విషయమై పోలీసులు విచారణ చేపడుతున్నారు. తన భర్తను తానే హత్యచేసినట్లు రాధ ఒప్పుకున్నప్పటికీ ఇతరుల ప్రమేయం ఉందా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. హత్య జరిగిన సమయంలో సాయిరెడ్డి మద్యం సేవించి ఉన్నాడని, హత్యలో ఇంకా ఒకరిద్దరి పాత్ర ఉండి ఉంటుందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వ్యాన్ బోల్తా.. ఇద్దరి మృత్యువాత

- మరో 15 మందికి గాయాలు
- బడాపహాడ్ దర్గాకు వెళ్తుండగా ప్రమాదం





శ్యాంసుందర్(ఫైల్) వసంత(ఫైల్)



బాధితురాలిని పరామర్శిస్తున్న ప్రశాంత్‌రెడ్డి



పరామర్శిస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్..

నిజామాబాద్ రూరల్: మొక్కు చెల్లించుకునేందుకు దర్గా వద్దకు వెళ్తుండగా జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు మృత్యువాతపడ్డారు. మరో 15 మంది గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన రెంజర్ల స్వామి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులతో కలిసి గురువారం రాత్రి తొమ్మిది గంటలకు ఐచర్ వ్యాన్‌లో వర్ని మండలంలోని బడాపహాడ్ దర్గాకు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం నిజామాబాద్ రూరల్ మండలంలోని మల్కాపూర్ గ్రామ శివారులో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో రెంజర్ల వసంత(30), రెంజర్ల శ్యాంసుందర్(48) అక్కడికక్కడే మృతి చెందారు. వ్యాన్‌లో ప్రయాణిస్తున్న మరో 15 మందికి గాయాలయ్యాయి. ఇందులో ఇద్దరు మహిళల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. క్షతగాత్రులు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రితోపాటు మరో రెండు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఎంపీ అర్వింద్, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, ఎంపీ అభ్యర్థులు బాజిరెడ్డి గోవర్ధన్(బీఆర్‌ఎస్), జీవన్‌రెడ్డి(కాంగ్రెస్) బాధితులను శుక్రవారం పరామర్శించారు. డ్రైవర్ నిర్లక్ష్యంతో అతివేగంగా వాహనాన్ని నడపడం వల్లే ప్రమాదం జరిగిందని బాధితులు ఆరోపిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఐచర్ వ్యాన్ డ్రైవర్ కృష్ణపై కేసు నమోదు చేశామని నిజామాబాద్ రూరల్ ఎస్‌హెచ్‌వో చైతన్యరెడ్డి తెలిపారు.

రెండిళ్లకు పెద్ద దిక్కు శ్యాంసుందర్

కమ్మర్‌పల్లి: వ్యాన్ బోల్తాపడిన ఘటనలో మృతి చెందిన రెంజర్ల శ్యాంసుందర్ రెండు కుటుంబాలకు పెద్ద దిక్కుగా ఉన్నాడు. మండల కేంద్రానికి చెందిన శ్యాంసుందర్ 19ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన ఏనుగు అంజయ్య కూతురు భారతిని వివాహం చేసుకొని ఇల్లరికం వెళ్లాడు. శ్యామ్‌సుందర్ తండ్రి రెంజర్ల చిన్న నర్సయ్య 12ఏళ్ల క్రితం, మామ అంజయ్య కొన్నేళ్ల క్రితం కొవిడ్‌తో మరణించారు. దీంతో అటు తన కుటుంబ బాధ్యతలతోపాటు ఇటు అత్తవారింటి బాధ్యతలను శ్యాంసుందర్ చూసుకుంటున్నాడు. పెద్దదిక్కైన శ్యాంసుందర్ మృతితో రెండు కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడ్డాయి.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలుశిక్ష

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన నలుగురికి న్యాయమూర్తి జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ నారాయణ తెలిపారు. నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో తొమ్మిది మందికి ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ కౌన్సెలింగ్ ఇచ్చి మార్నింగ్ కోర్టులో హాజరుపరిచారన్నారు. న్యాయమూర్తి సయ్యద్ ఖదీర్ ఐదుగురికి రూ.5వేల జరిమానా విధించారని, మరో నలుగురిలో ఒకరికి నాలుగు రోజుల జైలు శిక్ష, ఇద్దరికి రెండు రోజుల చొప్పున, మరొకరికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు వివరించారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని ఏసీపీ సూచించారు.

మాక్లూర్ మండలానికి చెందిన ఇద్దరికి..

మాక్లూర్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో మండలానికి చెందిన ఇద్దరికి న్యాయమూర్తి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై సుధీర్‌రావు శుక్రవారం తెలిపారు. ఈనెల 25న మానిక్‌బండార్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా, గుత్పతండా, మానిక్ బండార్‌కు చెందిన ఇద్దరు పట్టుబడ్డారన్నారు. ఇరువురిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

తొమ్మిది మంది రిమాండ్

సిరికొండ: మండలంలోని గడ్కోల్‌కు చెందిన గుర్రాల రవీందర్ ఆత్మహత్యకు కారణమైన తొమ్మిది మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రమేశ్ శుక్రవారం తెలిపారు. ఇద్దరిని గురువారం, ఏడుగురిని శుక్రవారం రిమాండ్‌కు తరలించామన్నారు.

3.5 కిలోల గంజాయి స్వాధీనం

కామారెడ్డి క్రైం: నిజామాబాద్ నుంచి తీసుకువచ్చిన గంజాయి కామారెడ్డిలో ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్న ఓ ముఠాను ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. 3.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. పట్టణంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్‌రాజు వివరాలు వెల్లడించారు. నిజాంసాగర్ చౌరస్తాలోని ఓ టీపాయింట్ వద్ద గంజాయి ప్యాకెట్లను విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు శుక్రవారం దాడి చేసి స్వామి అనే వ్యక్తి నుంచి 70 గ్రాములు గంజాయిని స్వాధీని చేసుకొని విచారించారు. నిజామాబాద్‌లోని ఆటోనగర్‌కు చెందిన ఫరీదా బేగం నుంచి తాను గంజాయి తీసుకువచ్చినట్లు స్వామి తెలుపడంతో ఆటోనగర్‌కు వెళ్లి సదరు మహిళ ఇంట్లో సోదాలు నిర్వహించి 3.48 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, దాడుల్లో ఏఈఎస్ హన్మంత్‌రావు, సీఐ విజయ్‌కుమార్, ఎస్సై విక్రమ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు.

రైస్‌మిల్లులో అగ్నిప్రమాదం

- అధిక ఉష్ణోగ్రత కారణంగా పేలిన గ్యాస్ సిలిండర్
- వేగంగా వ్యాపించిన మంటలు



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

బాన్సువాడ రూరల్: మండలంలోని తాడ్కోల్ గ్రామంలో ఉన్న వేంకటేశ్వర రైస్‌మిల్లులో శుక్రవారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పెరిగిన ఉష్ణోగ్రత కారణంగా రైస్‌మిల్లులోని స్టోర్‌రూం (రేకుల షెడ్డు)లో ఉంచిన గ్యాస్‌సిలిండర్ పేలి మంటలు వ్యాపించాయి. స్టోర్ రూంలో గన్నీ సంచులు, ఆయిల్‌తోపాటు ఇతర వస్తువులు ఉండడంతో మంటలు వేగంగా వ్యాపించి పొగలు కమ్ముకున్నాయి. రేకులు ఎగిరిపడ్డాయి, హమాలీలు వెంటనే స్పందించి ఇసుక, నీళ్లు చల్లి మంటలార్పే ప్రయత్నం చేస్తుండగా ఘటనాస్థలానికి ఫైర్‌ఇంజిన్ చేరుకుంది. మంటలు చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించకుండా ఫైర్ సిబ్బంది తగిన చర్యలు తీసుకున్నారు. సమాచారం అందుకున్న సీఐ కృష్ణ ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని తెలుసుకున్నారు. భవిష్యత్‌లో మరిన్ని ప్రమాదాలు చోటు చేసుకోకముందే ఉన్నతాధికారులు స్పందించి నివాస ప్రాంతాల్లోని పరిశ్రమలను శివారు ప్రాంతానికి తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విలేజ్ పార్క్ వద్ద..

వర్ని: మండలంలోని సత్యనారాయణపురం విలేజ్ పార్క్ వద్ద శుక్రవారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. అప్రమత్తమైన గ్రామ పంచాయతీ కార్యదర్శి.. సిబ్బంది సహకారంతో మంటలను ఆర్పివేశారు. గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ కాల్చి పారేయడంతో మంటలు అంటుకున్నట్లు కార్యదర్శి సాయిలు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో బీడీలు, సిగరెట్లను కాల్చి పారేయొద్దని సూచించారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా కందర్‌పల్లి రోడ్డులో శుక్రవారం బైక్‌ను ట్రాలీఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో శివప్రసాద్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ మద్యం సేవించి అతివేగం, అజాగ్రత్తగా ఆటో నడిపి బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో బైక్ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీ వెనుక చక్రాల్లోకి దూసుకెళ్లింది. లారీ డ్రైవర్ గమనించి వెంటనే బ్రేకులు వేయడంతో ప్రమాదం తప్పింది. శివప్రసాద్ ప్రాణాలతో బయటపడినప్పటికీ.. తల, ముఖానికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. మద్యం సేవించిన ఆటోడ్రైవర్‌ను స్థానికులు పోలీసులకు అప్పగించారు.

పరిస్థితి విషమించి ఒకరి మృతి

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. దోమకొండ మండలం సంగమేశ్వర గ్రామానికి చెందిన పరశురాములు (35)కు ఏడాదాది క్రితం భార్య విడాకులు ఇచ్చింది. అప్పటినుంచి ఆయన సరిగా ఇంటికి వెళ్లకుండా గ్రామాల్లో తిరుగుతున్నాడు. ఈ క్రమంలో గురువారం జంగంపల్లి బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం పరశురాములును ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు వెంటనే కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరశురాములు ఫొటోతో సమాచారాన్ని అన్ని వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారు. సమాచారం తెలియడంతో కుటుంబ సభ్యులు వెంటనే కామారెడ్డికి వెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు పరశురాములు నిజామాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నడిపల్లి తండాకు చెందిన యువకుడు..



డిచ్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయాలపాలైన మండలంలోని నడిపల్లితండాకు చెందిన బట్టు సతీశ్(28) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్సై యూ.మహేశ్ తెలిపారు. ఈ నెల 20న రాత్రి సమయంలో సతీశ్ తన అన్న బట్టు సురేశ్‌తో కలిసి డిచ్‌పల్లిలోని ఆస్పత్రికి వచ్చి బైక్‌పై తిరిగి వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అన్నాదమ్ముళ్లిదరికీ గాయాలయ్యాయి. మృతుడికి భార్య స్వప్న, ఆరు నెలల పాప ఉన్నారు. సతీశ్ మృతి చెందడం, సురేశ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో నడిపల్లి తండాల్లో విషాదం నెలకొంది.

బ్యాటరీలు, టైర్లు చోరీ

భిక్కనూరు : మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో ఉన్న నందిని రెడీమిక్స్ ప్లాంట్‌లో టైర్లు, బ్యాటరీలు చోరీ అయినట్లు ప్లాంట్ యజమాని గంద్ర మధుసూదన్ రావు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. గురువారం రాత్రి ప్లాంట్ ఆవరణలో నాలుగు లారీలు నిలిపి ఉంచగా, రెండు లారీల బ్యాటరీలతోపాటు మరో రెండు లారీల టైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.